ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 01.12.2025 సమయం: 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులన్నీ పూర్తి చేసే బాధ్యత తీ సుకుంటానని ఈరోజు నారాయణ పేట జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు.

2. రాష్ట్రంలో మరో రెండు నెలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్సిటీని ప్రారంభిస్తున్నట్టు ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు.

3. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన HILT పాలసీని బిజెపి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు తెలిపారు.

4. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు పలు జిల్లాల్లో అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు.

**రేవంత్ పర్యటన**

ఉమ్మడి రాష్ట్రంతో పాటు పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉమ్మడి పాలమూరు జిల్లా నిర్లక్ష్యానికి గురైందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పాలమూరు ప్రజలు ఇక్కట్లు పడుతున్నా.. ఏ నాయకుడు కూడా పట్టించుకోలేదని తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నారాయణపేట జిల్లా, మక్తల్ లో ఈరోజు మధ్యాహ్నం పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ.. . ఎంత ఖర్చు అయినా సరే.. ఉమ్మడి

పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులన్నీ పూర్తి చేసే బాధ్యత తనదని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. ఇప్పటికే నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టు , పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పనిచేసే వాళ్లను, మంచి వాళ్లను ఎన్నుకోవాలని రేవంత్ రెడ్డి సూచించారు.

**బైట్ - రేవంత్ రెడ్డి**

పిటిసి, మహబూబ్ నగర్

**వనపర్తి సీఎం**

అంతకుముందు ఈరోజు మధ్యాహ్నం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వనపర్తి జిల్లాలోని ఆత్మకూరుకు హెలికాప్టర్ లో వెళ్లారు. పీజేపీ క్యాంపు ఆవరణలో సీఎం రేవంత్ రెడ్డి మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , జూపల్లి కృష్ణారావుతో కలిసి 173 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 122 కోట్ల రూపాయలతో ఆత్మకూర్ నుంచి జోగులంబ గద్వాలకు హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం , 22 కోట్ల రూపాయలతో 50 పడకల ఆసుపత్రి నిర్మాణంతో పాటు.. అమరచింత , ఆత్మకూర్ మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కోసం 30 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

పిటిసి, వనపర్తి

**ఏఐ యూనివర్సిటీ**

ప్రపంచంలోని అత్యుత్తమ యూనివర్సిటీల సాంకేతిక సహకారంతో మరో రెండు నెలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్సిటీని ప్రారంభిస్తున్నట్టు ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. సాఫ్ట్ వేర్ రంగంలో పని చేస్తున్న ఇంజనీర్లు , చదువులు పూర్తి చేస్తున్న విద్యార్థులకు దీని ద్వారా నూతన నైపుణ్యాల్లో శిక్షణ అందిస్తామని తెలిపారు. ఈరోజు ఆయన కోవాసెంట్ ఏఐ ఇన్నోవేషన్ సెంటర్ ను హైదరాబాద్ లో ప్రారంభించిన సందర్భంగా ప్రసంగించారు. ప్రస్తుతం 500 మంది ఇంజనీర్లు పని చేస్తున్న కోవాసెంట్ మరో రెండేళ్లలో 3 వేల మంది ప్రతిభావంతుల కు ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని శ్రీధర్ బాబు చెప్పారు. ఏఐ సాంకేతిక దూకుడుతో కోడింగ్ లో ఉన్నవారు ఇతర ప్లాట్ ఫారాల్లో పనిచేస్తున్న వారు

నైపుణ్యాలను పెంచుకోక తప్పని పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. వారందరికి ఏఐ యూనివర్సిటీ ద్వారా రీస్కిల్, అప్ స్కిల్స్ అందిస్తామని చెప్పారు.

జీఎస్

**తుమ్మల**

అభివృద్ధి పనులు నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ లో మున్నేరు నదిపై రిటైనింగ్ వాల్, కేబుల్ బ్రిడ్జి నిర్మాణం, ఖమ్మం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులపై ఈరోజు అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. . ప్రతి నెలా ఎంత మేరకు పనులు పూర్తవుతాయో నిర్దిష్ట ప్రణాళిక తయారు చేసి సమర్పించాలని.. మంత్రి సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీలకు, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

పిటిసి, ఖమ్మం

**బీజేపీ హిల్ట్**

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన **Hyderabad Industrial Lands Transformation - HILT** పాలసీని బిజెపి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు తెలిపారు. ఈ పాలసీని నిలిపివేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు భారతీయ జనతా పార్టీ ప్రతినిధి బృందం ఈరోజు వినతిపత్రం సమర్పించింది. అనంతరం రామచందర్ రావు మాట్లాడుతూ.. ఈ పాలసీతో చాలా మందికి తీవ్రమైన నష్టం జరుగుతుందని, గతంలో పరిశ్రమల కోసం కేటాయించిన హైదరాబాద్ లోని విలువైన పారిశ్రామిక భూములను రియల్ ఎస్టేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా, ఈనెల 7న ఇందిరా పార్క్ వద్ద బిజెపి మహా ధర్నా నిర్వహిస్తుందని అన్నారు. గవర్నర్ ను కలిసిన వారిలో బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి గారు, మల్క కొమురయ్య తదితరులు ఉన్నారు.

జీఎస్

**అద్దె బస్సులు**

రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు మరిన్ని ఆర్టీసీ అద్దె బస్సులు కేటాయించడానికి ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 152 ఆర్టీసీ అద్దె బస్సులను మండల మహిళా సమాఖ్యలు నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి లేఖ రాశారు. మండల మహిళా సమాఖ్యలు 448 బస్సుల కొనుగోలు పూర్తిచేసి , వాటిని ఆర్టీసీకీ అద్దెకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశారు. అవసరమైన అనుమతులు మంజూరైన వెంటనే , ఆ బస్సులను ఆర్టీసీ అప్పగించనున్నట్లు పేర్కొన్నారు. దీంతో త్వరలోనే ఆర్టీసీలో మహిళా సమాఖ్యల ద్వారా నడిచే బస్సుల సంఖ్య గణనీయంగా పెరగనుంది.

జీఎస్

**రాధాకృష్ణన్**

పార్లమెంటు సభ్యులు రాజ్యాంగాన్ని కాపాడాలని , పార్లమెంటు ప్రవర్తన లక్ష్మణ రేఖను పాటించాలని రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ సభ్యులను కోరారు. ఈరోజు ప్రారంభమైన శీతాకాల సమావేశాల మొదటి రోజున చైర్మన్‌గా మొదటిసారి ఎగువ సభ కార్యకలాపాలను నిర్వహిస్తున్న రాధాకృష్ణన్ మాట్లాడుతూ ... ప్రజల న్యాయమైన ఆకాంక్షలను నెరవేర్చడానికి నిబద్ధతతో పనిచేయడం ఎంపీల విధి అని నొక్కి చెప్పారు. ప్రజాస్వామ్యంలో మాత్రమే ఒక వ్యక్తి అత్యంత వినయపూర్వకమైన ప్రారంభం నుండి ప్రజా జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగగలరని అన్నారు. తనకు శుభాకాంక్షలు తెలిపిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్ఎస్డీ

**గిగ్**

ఈ-శ్రమ్ పోర్టల్‌లో ఇప్పటి వరకు 31 కోట్లకు పైగా అసంఘటిత కార్మికులు , ఐదు లక్షలకు పైగా గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులు నమోదు చేసుకున్నారని కేంద్రం తెలిపింది. యూనివర్సల్ అకౌంట్ నంబర్ అందించడం ద్వారా వారిని నమోదు చేయడానికి ఈ-శ్రమ్ పోర్టల్ ను 2021లో

ప్రారంభించారు. ఈరోజు కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా ఈ విషయం తెలిపారు.

ఎన్ఎస్డీ

**ఎయిడ్స్**

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో అవగాహన ర్యాలీలు , సదస్సులు నిర్వహించారు. ఎయిడ్స్ నివారణ పై సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ములుగు జిల్లాలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి గోపాల్ రావు పాల్గొన్నారు. నిర్మల్ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. నాగర్ కర్నూలు జిల్లాలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ బాదావత్ సంతోష్ పాల్గొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగిన కార్యక్రమంలో డిఎంహెచ్ వో తుకారాం రాథోడ్ పాల్గొన్నారు.

పిటిసి, ములుగు, నాగర్ కర్నూలు, నిర్మల్, భద్రాద్రి

**మేడారం**

మేడారం అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏ మాత్రం పొరపాట్లు దొర్లినా కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హెచ్చరించారు. మేడారం అభివృద్ధి పనులపై తన నివాసంలో ముఖ్యమంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. పనులు సాగుతున్న తీరుపై ప్రదర్శించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను పరిశీలించిన ముఖ్యమంత్రి.. పలు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఆదివాసీ సంస్కృతి , సంప్రదాయాలు, ఆచారాలకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి తెలిపారు.

జీఎస్

**హడ్కో**

తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న భారత్ ఫ్యూచర్ సిటీ , హైదరాబాద్ మెట్రో విస్తరణ , ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్ల నిర్మాణాలకు తక్కువ వడ్డీ రేటుతో రుణాలు ఇవ్వాలని

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హడ్కో ఛైర్మన్ సంజయ్ కులశ్రేష్ఠను కోరారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కులశ్రేష్ఠ ఈరోజు సమావేశమయ్యారు.

జీఎస్